# సాక్షి కామారెడ్డి

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023






## రెగ్యులరైజ్ చేయాలి

తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు.

- 2లో ▸



## అభివృద్ధే ధ్యేయంగా..

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 3లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /22.9

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### 'మిల్లెట్స్‌పై సెమినార్'




కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 'మిల్లెట్స్ ఒక మంచి ఆహారమేనా లేదా వ్యామోహమా' అనే అంశంపై సైన్స్ సెమినార్ నిర్వహించారు. జిల్లాలోని 30 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని స్ఫూర్తి రెడ్డి విజేతగా నిలిచారని జిల్లా సైన్స్ అధికారి సిద్ధి రాంరెడ్డి తెలిపారు. ఆమెకు గైడ్ టీచరుగా సరిత వ్యవహరించారన్నారు. ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో జిల్లా స్థాయి విజేత పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగకిషన్, ప్రవీణ్ కుమార్, రాజు, సురేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



లింగంపేట: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. శనివారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పుతుందన్నారు. ఈ సమయంలో విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తమ జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు. లింగంపేట కళాశాల నుంచి ఆరుగురు మెడికల్ సీట్లు సాధించారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాపకులు రాజయ్య, దుర్గయ్య, శివ, నాగు, అంజమ్మ, శ్రీలత, శ్రీకాంత్, రజాక్ పాల్గొన్నారు.

### ఓటరు నమోదుపై విద్యార్థుల ప్రదర్శన




కామారెడ్డి టౌన్: ఓటరు నమోదుపై అవగాహన కలిగించేందుకు శనివారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి నాటకం(స్కిట్), పాటలు, పద్యాల పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎంపిక చేశారు. వారు ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య తెలిపారు. ఈనెల 12న డివిజనల్ స్థాయిలో పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన వారికి శనివారం పోటీలు నిర్వహించామన్నారు. స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ అకాడమీకి ఎంపిక



తాడ్వాయి: తాడ్వాయికి చెందిన మద్ది విశాల్‌రెడ్డి వాలీబాల్ విభాగంలో తెలంగాణ అకాడమీకి ఎంపికయ్యాడు. విశాల్‌రెడ్డి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో జరిగిన సెలక్షన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో 70మంది పాల్గొనగా విశాల్‌రెడ్డి ఎంపికయ్యాడు. సర్పంచ్ సంజీవులు, ఎస్‌ఎంసీ అధ్యక్షుడు జగదీశ్వర్, వైస్ ఎంపీపీ నర్సింలు, వీడీసీ చైర్మన్ రాజు, పీఈటీ బాలయ్య విశాల్‌ను అభినందించారు.

# పోరుబాటలో నేలకొరిగిన యోధులెందరో..




నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాల్లో జిల్లావాసులు క్రియాశీలక పాత్ర పోషించారు. ఆంధ్రమహాసభ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల్లో ఎంతోమంది పాల్గొన్నారు. ఉద్యమంలో పలువురు తమ ప్రాణాలను కూడా త్యాగం చేశారు. మరెంతో మంది జైలు పాలయ్యారు. నిజాం పాలననుంచి విముక్తి లభించి, 75 ఏళ్లవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

- జైలు పాలైన వందలాది మంది వీరులు
- నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

సాక్షి, కామారెడ్డి: దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం సిద్ధించింది. బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాల నుంచి భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నా.. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రజలు మాత్రం ఆ భాగ్యానికి నోచుకోలేకపోయారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు 13 నెలలపాటు మరో పోరాటం చేయాల్సి వచ్చింది. ఆ పదమూడు నెలల్లో నిజాం సేనల చేతిలో ప్రజలు చిత్రహింసలను ఎదుర్కొన్నారు. అప్పటి యువతరం నిజాంకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. కామారెడ్డి ప్రాంతానికి వకీల్ భూమారెడ్డి, జీడిపల్లి విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డితో పాటు చాకలి సాయన్న, రాజారెడ్డి, లక్ష్మారెడ్డి, గంగారెడ్డి, ఆగమయ్య, గుండారెడ్డి, రాజీరయ్య, వెంకయ్య, మల్లయ్య, రాంచంద్రం, బాదల్‌చంద్, గంగయ్య, బాల్‌లింగం, కిషన్‌రావ్ తదితరులు ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. జిల్లాలోని దోమకొండ, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద ప్రాంతాలకు చెందిన వందలాది మంది నిజాం పాలనపై జరిగిన అన్ని పోరాటాల్లో భాగమయ్యారు.

### జైలులోనూ నిరాహార దీక్ష చేసిన నారాయణరెడ్డి



భిక్కనూరుకు చెందిన దమ్మయ్యగారి నారాయణరెడ్డి ఆర్య సమాజ్‌లో చురుకుగా పనిచేశారు. మత మార్పిడులకు వ్యతిరేకంగా పనిచేయడంతో దుండగులు ఆయనపై దాడి చేసినప్పుడు రెండు చేతివేళ్లు తెగిపోయాయి. నిజాం ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయన పోరాడారు. దీంతో ప్రభుత్వం ఆయనను జైలుపాలు చేసింది. నిజామాబాద్ జైలులో బయటి వ్యక్తులతో దాడులు చేయించగా గాయపడిన దాశరథి, వట్టికోట, నారాయణరెడ్డి జైల్లో ఆరు రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు.

### చైతన్యశీలి వకీల్ భూమారెడ్డి



దోమకొండ మండలం అంబారీపేటకు చెందిన న్యాయవాది బెంజరం భూమారెడ్డి ఆయన భార్య సత్యవతి తెలంగాణ విమోచన పోరులో కీలక భూమిక పోషించారు. ఆంధ్ర మహాసభల ద్వారా కుల, మత, జాతి భేదాలు లేకుండా అందరినీ కలుపుకుని కార్యక్రమాలు చేపట్టారు. ఆంధ్ర మహాసభలతో పాటు మహిళా మహాసభలు నిర్వహించే క్రమంలో దేవరకొండ నుంచి నిజామాబాద్ వరకు జరిగిన మహాసభలలో భూమారెడ్డి తన భార్య సత్యవతితో పాటు సంఘ బాధ్యుడి హోదాలో పాల్గొన్నారు. నిజామాబాద్‌లో ఆరో ఆంధ్ర మహాసభ నిర్వహించడానికి ఆయన కృషి చేశారు. కామారెడ్డికి చెందిన న్యాయవాదులు ముస్రిఫ్ నారాయణరావ్, నర్సింహారావ్, పండిత్ నర్సింహారావ్‌లు కూడా భూమారెడ్డితో పాటు పాల్గొన్నారు. 1940 లో భూమారెడ్డి మరణించాడు. భూమారెడ్డి కుమారుడు జస్టిస్ జీవన్‌రెడ్డి హైకోర్టులో న్యాయవాదిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు.

### సాయుధ దళాన్ని ఏర్పాటు చేసిన గోపాల్‌రెడ్డి



సదాశివనగర్ మండలం కుప్రియాల్‌కు చెందిన మంద గోపాల్‌రెడ్డి మొదట ఆంధ్ర మహాసభలో తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా పనిచేశారు. నిజాం నిరంకుశత్వానికి, భూస్వాములు, రజాకార్ల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పదకొండు మంది సభ్యులతో కిషన్ దళం ఏర్పాటు చేసి సిరిసిల్ల కేంద్రంగా కామారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగించారు. ఆనభేరి ప్రభాకర్‌రావ్, భూపతిరెడ్డిల నాయకత్వాన గోపాల్‌రెడ్డి దళం పనిచేసింది. అన్నారం, రెడ్డిపేట గ్రామాల్లో రెవెన్యూ రికార్డులను తగలబెట్టారు. హన్మాజీపేట గడీపై దాడి చేసి ఆహార ధాన్యాలను ప్రజలకు పంచిపెట్టారు. హైదరాబాద్ నుంచి వచ్చే కమ్యూనిస్టు నాయకులకు రక్షణ కల్పించి వారిని పోరాట ప్రాంతాలకు తీసుకువెళ్లడంలో గోపాల్‌రెడ్డితో పాటు శివాయిపల్లికి చెందిన గంగారాం కలిసి పనిచేసేవారు.

### జైలులోనూ జంగ్ నడిపిన విఠల్‌రెడ్డి



పాల్వంచ మండలం ఫరీదుపేటకు చెందిన జీడిపల్లి విఠల్‌రెడ్డి న్యాయవాద విద్యనభ్యసించి 1945 నుంచి కామారెడ్డి న్యాయస్థానంలో ప్రాక్టీస్ చేశారు. నైజాం రాజ్యంలో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడిన సమయంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలంతా సమావేశమై ప్రభుత్వ గోదాములపై దాడి చేసి ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన నైజాం పోలీసులు వందలాది మందిని అరెస్టు చేసి జైల్లో వేశారు. బాధితులకు అండగా నిలిచిన విఠల్‌రెడ్డిని అరెస్టు చేసి నిజామాబాద్ జైలులో నిర్బంధించారు. ఖైదీలను గ్రూపులుగా విభజించి ఇబ్బంది పెట్టడంతో విఠల్‌రెడ్డి జైల్లో ఉద్యమం లేవదీశారు. దీంతో కన్నెర్ర చేసిన జైలు అధికారులు విఠల్‌రెడ్డితో పాటు మరికొందరిని ఔరంగాబాద్ జైలుకు తరలించారు. దాదాపు 13 నెలలు జైలు జీవితం గడిపారు. పోలీసు యాక్షన్ తర్వాత విఠల్‌రెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. 1952 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విఠల్‌రెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు.

### ■ సాయుధ మణిహారం.. మన ఫణిహారం..



కామారెడ్డి పట్టణానికి చెందిన ఫణిహారం రంగాచారిది వీరోచిత పోరాటం. హైదరాబాద్ సంస్థానంలో ప్రజల ఉద్యమాలపై రంగాచారి చిత్ర ప్రదర్శనలు నిర్వహించి చైతన్యపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల దోపిడి, నిర్బంధ పన్నులు, లెవీ వసూళ్లపై రంగాచారి ఎన్నో చిత్రాలు గీశారు. ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ హైదరాబాద్‌లోని ముగ్దుంభవన్‌లు ఉన్నాయి. ఆయన గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. రంగాచారి తన సహచరులు బాసిత్, షానూర్‌అలీ, నర్సింగ్‌రావ్ మరికొందరితో కలిసి ఆయుధాలు సేకరించి వాటిని ఉద్యమ ప్రాంతాలకు పంపించేవారు. కాగా నల్గొండకు చెందిన రాంచంద్రారెడ్డి ఎలుగుబంటి దాడిలో గాయపడగా.. ఆయనను చికిత్స కోసం చిలుకలగూడలో రంగాచారి నిర్వహిస్తున్న రహస్య స్థావరానికి తీసుకువచ్చారు. రంగాచారి అతడిని వెంటనే ఇతర ప్రాంతానికి తరలించారు. ఎడ్లబండిపై పడ్డ రక్తపు మరకల ఆధారంగా పోలీసులు రాంచంద్రారెడ్డిని తీసుకువచ్చిన బండి యజమానిని పట్టుకుని చిత్రహింసలకు గురిచేయడం ద్వారా సమాచారాన్ని సేకరించి, రహస్య స్థావరంలో ఉన్న రంగాచారి, వెదిరె రాజిరెడ్డిలను అరెస్టు చేశారు. చంచల్‌గూడ జైలులో బంధించి చిత్రహింసలకు గురిచేసినా ఏ రహస్యాన్నీ బయటపెట్టకపోవడంతో పోలీసులు వరంగల్ జిల్లాలోని మామునూర్ కాన్సన్‌ట్రేషన్ క్యాంపునకు తరలించి అక్కడా చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారు. అనంతర కాలంలో ప్రజలు కామారెడ్డిలో రంగాచారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



# కేసీఆర్‌ను ఇంటికి సాగనంపాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

- తెలంగాణలోనూ బీజేపీదే అధికారం
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

నిజాంసాగర్: తెలంగాణను మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ఇంటికి సాగనంపాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జుక్కల్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ బూత్‌కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడంలేదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన ధ్వజమెత్తారు. హుజూరాబాద్ ఎన్నికల్లో రూ. 600 కోట్లు ఖర్చు చేసినా బీఆర్‌ఎస్ గెలవదని గ్రహించిన సీఎం కేసీఆర్.. దళితుల ఓట్ల కోసం దళితబంధు పథకం తెచ్చారన్నారు. దళితబంధు తీసుకున్నవారు కేసీఆర్ మాయమాటలు నమ్మకుండా బీజేపీకి ఓటేసి గెలిపించారన్నారు. ఎస్సీ నియోజకవర్గాలలో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బూత్ స్థాయి కార్యకర్తలు పార్టీకి పునాదులన్నారు. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త కనీసం పది కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని సూచించారు. జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో భూబకాసూరుల రాజ్యం నడుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆరోపించారు. భూములు, గుట్టలు, చెరువులు లేకుండా బీఆర్‌ఎస్ పార్టీ భూ భకాసూరులు మింగేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో వారికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సమావేశంలో బీజేపీ నేతలు బూర నర్సయ్య, విఠల్, బద్దం మైపాల్‌రెడ్డి, ఎర్ర మహేశ్, రవిగౌడ్, మాల్యాద్రిరెడ్డి, హన్మండ్లు, శివాజీపటేల్, రాములు సేట్ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ రూపురేఖలు మార్చేశారు

- మంత్రి గంగుల కమలాకర్
- బీర్కూర్‌లో బీసీ గురుకుల పాఠశాల ప్రారంభంలో స్పీకర్‌కు ప్రశంసలు



బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి గంగుల కమలాకర్

బాన్సువాడ: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ ప్రాంత రూపురేఖల్ని మార్చేశారని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలో రూ.6.70 కోట్లతో నిర్మించిన బీసీ గురుకుల బాలుర పాఠశాలను శనివారం ఆయన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారన్నారు. తెలంగాణ వచ్చాక కులవృత్తులకు ఆదరణ లభించిందన్నారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో 327 గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయని, అందులో లక్షా 85 వేల మంది బీసీ లు చదువుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పు కుంటానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాదు ప్రైవేటు రంగాల్లోనూ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. సీఎం జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారని, ఇందులో ఏటా 10 వేల మంది వైద్యులు తయారవుతా రని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆడబిడ్డల కోసం బీసీ డిగ్రీ కళాశాల మంజూరు చేసిన గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి మల్లయ్య భట్టు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీటీసీ సందీప్, నాయకులు గంగారాం, శశికాంత్, నాయకులు కొల్లి గాంధీ, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ : బాన్సువాడలో ఈనెల 27న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. బాన్సువాడ ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళాలో 60కిపైగా కంపెనీలు పాల్గొంటాయని భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్హతలు కలవారు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ తదితరులు పాల్గొన్నారు.



రైలు వచ్చే సమయంలో మొరాయించిన ఒక గేటు



రైలు వెళ్లిపోయాక మరో గేటు మొరాయించడంతో నిలిచిపోయిన వాహనాలు



గేటును పైకి లేపి, వాహనాలను పంపిస్తున్న రైల్వే సిబ్బంది

# మొరాయించిన రైల్వే గేటు

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డిలో రైల్వే గేటు మొరాయించడంతో సుమారు అరగంట పాటు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయం కావడంతో కామారెడ్డిలోని అశోక్‌నగర్ రైల్వే గేట్‌ను వేయడానికి గేట్‌మన్ యత్నించారు. ట్రాక్‌కు ఒక వైపు గేటు మాత్రమే పడింది. రైలు వస్తుండడంతో ఆల్టర్నెట్ గేటు వేశారు. రైలు వెళ్లిన తర్వాత గేటు లేవకపోవడంతో రైల్వే కూలీలను రప్పించి, మొరాయించిన గేటును పైకి లేపి పట్టుకున్నారు. వాహనాలు వెళ్లిపోయేదాకా అలాగే మోశారు. గేటు మొరాయించడంతో వాహనదారులు సుమారు అరగంటపాటు ఇబ్బందిపడ్డాల్సి వచ్చింది.

# వీరోచిత పోరాటంతో విమోచనం

- తెలంగాణ విమోచన ఉద్యమంలో జిల్లాకు సుస్థిర స్థానం
- వీరులకు పుట్టినిల్లు ఇందూరు

**మోర్తాడ్(బాల్కొండ):** నిజాం రజాకార్ల గుర్రపు డెక్కల చప్పుళ్లకు వెరవని ధీరులు మనవారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదురించడానికి 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు ఉద్యమంతో స్ఫూర్తిని పొందిన మన సమరయోధులు నిజాం నిరంకుశత్వంపై నిరసన గళం విప్పారు. మొదటి స్వాతంత్య్ర సంగ్రామంలో మన ప్రాంతానికి చెందిన కౌలాస్ రాజు దిలీప్ సింగ్ చూపిన పోరాట పటిమ, ఝాన్సీ లక్ష్మీబాయి ప్రదర్శించిన తెగువతో తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటానికి నాంది పలికిన వారు కొందరు. అలాగే మహాత్మా గాంధీ బాటలో సత్యాగ్రహం ద్వారా స్వాతంత్య్ర ఉద్యమానికి ఊపిరిపోసిన వారు మరి కొందరు. ఇలా తెలంగాణ విమోచనం కోసం హింస, అహింస మార్గాల్లో వేర్వేరుగా పయనించిన యోధులకు పుట్టినిల్లు మన ఇందూరు గడ్డ.


నిజాం నిరంకుశత్వంతో నీరసించి పోయిన ప్రజలకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ రక్తపుటేరులను పారించిన రజాకార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఘన చరిత్ర మన సమరయోధులది. ఒకవైపు బ్రిటీష్ పాలనను ఎదురిస్తూ మరో వైపు నిజాం నిరంకుశ పాలనపై కత్తి ఎక్కుపెట్టిన ధీరత్వం మనవారి సొంతం. ఏకకాలంలో రెండు స్వాతంత్య్ర పోరాటాలు చేసిన ఘనత మనకే దక్కుతుంది. పల్లెలపై దాడులు చేస్తు అమాయక ప్రజల ధన, మాన ప్రాణాలను హరిస్తున్న రజాకార్ల గుంపుపై ఫిరంగులతో దాడికి పాల్పడిన మోర్తాడ్ జమీందార్ రుక్మారెడ్డిని దొంగచాటుగా బంధించి నిజాం పాలకులు ఇనుప సంకెళ్లతో బంధించి జైళ్లో ఉంచారు. ఇదే స్వాతంత్య్ర పోరాటంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ రాష్ట్ర కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. చౌట్‌పల్లి నారాయణరెడ్డి ఆర్య, చౌట్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, పడిగెల హన్మాండ్లు, నారాయణ లింగారెడ్డి, నీలకంఠ నారాయణ, పడకల్ శ్రీనివాస్‌రెడ్డి, శంభులింగం, లక్ష్మాగౌడ్, బ్రహ్మయ్య, వెంకటస్వామి, బొంబాయి నర్సింహారెడ్డి, నర్సింహారావు, నరసింహాశాస్త్రి, కొండా నారాయణ, ఉప్పు లక్ష్మయ్య, జె. హన్మంత్ రెడ్డి, టి. రంగారెడ్డి రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమానికి ప్రభావితులయ్యారు. ఉద్యమాన్ని ఉవెత్తుకు తీసుకెళ్లడానికి రామానందతీర్థకు ఎంతో సహకరించారు. 1947 ఆగస్టు 15న దేశమంతటా త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి సన్నాహాలు జరుగుతుంటే నిజాం పాలనలో ఉన్న మనకు ఆ స్వేచ్ఛను రజాకార్లు హరించారు. కానీ మన సమర యోధులు మాత్రం వారి ఆజ్ఞలను లెక్క చేయకుండా మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఫలితంగా జైలు ఊచలు లెక్కించారు.


రజాకార్లపై నిప్పులు కురిపించిన ఫిరంగి


ఉద్యమకారులకు అవాసమైన మోర్తాడ్ బురుజు

## ప్రజాసేవలో తరించిన ఉద్యమకారులు..

తెలంగాణ విమోచన ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యమకారులు విమోచనం తరువాత రాజకీయాల్లో చేరి ఉన్నత పదవులను అలంకరించారు. ఉద్యమస్ఫూర్తితో ప్రజాసేవలో తరలించినవారిలో మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన ఎం. నారాయణరెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన బడుగుల నేతగా గుర్తింపు పొందిన అర్గుల్ రాజారాం బాల్కొండ నియోజకవర్గానికి నాలుగుమార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతో పాటు చేనేత, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రిగా విశిష్టమైన సేవలు అందించారు. చౌట్‌పల్లికి చెందిన హన్మంత్‌రెడ్డి తెలంగాణ విమోచన ఉద్యమంలో గ్రామీణ ప్రాంత యువకులను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఉద్యమానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించారు. తెలంగాణ విలీనం అనంతరం జిల్లా పరిషత్ మొదటి చైర్మన్‌గా ఎంపికై ప్రజాసేవలో కొనసాగారు. వీరితో పాటు అనేక మంది తమ సొంత గ్రామాల్లో సర్పంచులు, సహకార సంఘాల చైర్మన్లుగా ఎంపికై ప్రజలకు విశేషమైన సేవలు అందించారు.


అర్గుల్ రాజారాం, మాజీ మంత్రి(ఫైల్)


ముస్కు నారాయణరెడ్డి, మాజీ ఎంపీ(ఫైల్)

## సిరికొండలో సాయుధ పోరాట ఛాయలు

**సిరికొండ:** మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చాయలు నేటికీ కదలాడుతున్నాయి. ఆనాటి ప్రజలు నేటికి గత స్మృతులను నెమరువేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన అణభేరి ప్రభాకర్ రావు నేతృత్వంలో మండలంలో సాయుధ పోరాటం జరిగినట్లు నాటి పెద్దమనుషులు చెబుతారు. ప్రభాకర్ సారథ్యంలో అదే సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమృత్‌లాల్ శుక్లా, శివాయిపల్లెకు చెందిన బల్‌రాం ఇక్కడ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. రజాకార్ల ఆకృత్యాలకు వేదికగా మారుతోందని హొన్నాజీపేట్ గడిపై వీరి ముఠా దాడి చేసింది. దాడితో గడి దొర ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌కు పారిపోయాడు. గడిలో ఉన్న వ్యవసాయ పరికరాలను వారు ఎతుకెళ్లి గడిని తగులబెట్టారు. ఈ ఘటనతో గడిలో కొద్ది భాగం ధ్వంసమైంది. ప్రభాకర్‌రావు బృందం మండలంలోని పలు గ్రామాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని భూస్వాముల చెరలో ఉన్న భూములను పేదలకు పంచిపెట్టారు. మండలంలోని కొండాపూర్, తూంపల్లిలో రెండు వందలు, తాట్‌పల్లిలో వంద, కమ్మర్‌పల్లి మండలం మానాలలో ఐదు వందలు, మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెలో యాభై ఎకరాల భూములను భూస్వాముల చెర నుంచి విడిపించి పేదలకు పంచిపెట్టారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో దాడి చేసి గ్రామ రికార్డులను దహనం చేశారు. వీరి సారథ్యంలో ఉద్యమం నడుస్తుండగా రజాకార్లకు పన్నులు కట్టడం, పశువులు మేపుకొనేందుకు చెల్లించే పన్నులను చెల్లించడం మానివేశారు. అలాగే గడ్కోల్‌లో దొరల వద్ద గుమాస్తాగా పని చేసే జంగం గంగన్నను ఉద్యమకారులు గ్రామ నడిబొడ్డున కాల్చి చంపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 1946 నుంచి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విస్తృతంగా సాగినట్లు చరిత్ర చెబుతోంది.



## రజాకార్లను గడుగొమ్ములతో ఉరికించినం



“ మన దేశాన్ని పట్టి పీడించిన బ్రిటీషోళ్లు వెళ్లిపోయింగ్రని రేడియోల్లో వార్తలు విని 1947 ఆగస్టు 15న మొదటిసారి శెట్‌పల్లిలో జెండాను ఎగురవేశాం. అప్పటికి నా వయస్సు 24 సంవత్సరాలు. నా భర్త మా ఊరి జమీందారులతో కలిసి తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొంటుండే. బ్రిటీష్ సైన్యం ఇంటిదారి పట్టినా నిజాం రజాకార్లు మాత్రం ఊర్లల్లో జెండాలను ఎగురవేయొద్దని హుకుం జారీ చేసింగ్రు. కానీ మేము అవేమీ పట్టించుకోలేదు. ధర్మోరా, శెట్‌పల్లిలో ఎంతో మంది రజాకార్లను ఎదురించాం. వాళ్లలో నా భర్త ఉండడం సంతోషంగా ఉంది. నా భర్తను రజాకార్లు కర్రలతో కొట్టింగ్రు. మా చేతిలో ఆయుధాలు లేకపోయినా గడుగొమ్ములతో వారి దాడిని ఎదురించి రజాకార్లను ఉరికించినాం. మా పోరాటం గురించి తెలుసుకున్న ప్రభుత్వం నన్ను సత్కరించింది. ప్రతి నెలా స్వాతంత్య్ర సమరయోధులకు ఇచ్చే పింఛన్‌ను మంజూరు చేసింది. ఇప్పటికీ ప్రతి జెండా పండుగకు జిల్లా కేంద్రానికి రమ్మని లెటర్లు పంపిస్తుంగ్రు. ”

– తక్కళ్లపల్లి రాజుబాయి, స్వాతంత్య్ర సమరయోధురాలు, శెట్‌పల్లి

# క్లుప్తంగా

## ఇంటి నుంచి భోజనం



**భిక్కనూరు:** మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు తమ బకాయిల కోసం నాలుగు రోజులుగా సమ్మెలో ఉన్నారు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాక్సులు తెచ్చుకొని భోజనం చేస్తున్నారు.

## దళితబంధు కోసం ధర్నా



**పిట్లం:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం దళిత బంధు కోసం దళితులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు దళితబంధును తమ అనుచరులకే ఇప్పిస్తున్నారని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బంధు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మండలంలోని చిల్లర్గి, గొడ్మెగాం, చిన్నకొడప్గల్, పిట్లం గ్రామ పంచాయతీల ఎదుట దళితులు అర్హులకు దళిత బంధు అందంచాలని నిరసన చేశారు.

## మధ్యాహ్న బిల్లుల కోసం..



**బాన్సువాడ:** మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఏజెన్సీల బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెంచిన వేతనాలు ఏప్రిల్ నుంచి అమలు చేయా లని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సోనియా, సాయిలు, రియాజ్, మల్లయ్య, సావిత్రి, మస్తాన్, నాగోని, నర్సింగ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కిట్ వసూళ్ల పై విచారణ



**రెంజల్(బోధన్):** ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుండగా వాటిని అడ్డం పెట్టుకుని కొందరు అందినకాడికి దండుకుంటున్నారు. బాలింతలకు అందించే కేసీఆర్ కిట్ కోసం రెంజల్ ఆస్పత్రి ఫార్మసిస్టు డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ శనివారం ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా అధికారికి అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెంజల్‌లో ఒకరికి డెంగీ పాజిటివ్ వచ్చిందని సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉండి ప్రజలను అప్రమతం చేయాలని సూచించారు.

# బహుజనుల బతుకులు మారితేనే అభివృద్ధి


మాట్లాడుతున్న సమాజ కాంగ్రెస్ చైర్మన్ వినయ్‌కుమార్

**కామారెడ్డి టౌన్:** బహుజనుల బతుకులు మారినప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందని తెలంగాణ సమాజ కాంగ్రెస్ చైర్మన్ పుంజాల వినయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రూ.వేల కోట్లు కాంట్రాక్టర్‌లు అగ్రవర్ణాలకు, గొర్రెలు, బర్రెలు మాత్రం బహుజనులకు అందజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పింఛన్‌ల కంటే మన బిడ్డలకు ఉద్యోగాలు ఇస్తే చాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం ఏ పార్టీలు కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, బహుజనులు రాజకీయంగా ఆర్థికంగా ఎదిగితే తప్పా హక్కులను సాధించుకోలేమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బహుజనుల అభివృద్ధితో పాటు రైతులకు గిట్టుబాటు ధర, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల నాయకులు సిర్నాపల్లి శ్రీహరి, వినోద్‌కుమార్, పాండుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ విభాగంలో సత్యంకు డాక్టరేట్

**భిక్కనూరు:** తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్ విద్యార్థి పీబీ సత్యం సోషల్ విభాగంలో శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ప్రొపెసర్ విజయకుమార్‌శర్మ మార్గదర్శనంలో 'తెలంగాణ రాష్ట్రంలో సామజిక కార్యకర్తల ఉద్యోగత ఆవశ్యకత'పై సత్యం పరిశోధన చేశారు. సత్యంను సోషల్ వర్క్ హెచ్‌వోడీ రాజేశ్వరీ, బోర్డు ఆఫ్ చైర్ పర్సన్ డాక్టర్ వీరభద్రం, అధ్యాపకులు అంజయ్య, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి అభినందించారు.

## ఎల్లారెడ్డి కళాకారుడికి అవార్డు



**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన చుక్క గోపాల్‌గౌడ్ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డును అందుకున్నారు. గోపాల్‌గౌడ్ కళారంగంలో చూపిన ప్రతిభకు హైద్రాబాద్‌లోని మంజునాథ ఫౌండేషన్ నిర్వాహకులు అవార్డును అందజేశారు.

## ప్రతి గ్రామం నుంచి తుక్కుగూడకు..



**భిక్కనూరు:** కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న చలో తుక్కుగూడ సభకు అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధమయ్యారని ఆ పార్టీ రాష్ట కార్యదర్శి బద్దం ఇంద్రకరన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మాట ఇచ్చి మరిచిపోవడం సీఎం కేసీఆర్ నైజమన్నారు. తుడుం జీవన్, అంజయ్య, సిద్దరాములు, నర్సింలు, ఎల్లం ఉన్నారు.

# ఓటరు జాబితాలో పొరపాట్లకు తావివ్వొద్దు

- రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ


కామారెడ్డిలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న క్రిస్టీనా జెడ్ చోంగ్తూ

**కామారెడ్డి క్రైం:** ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా రూపొందించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ సూచించారు. ఓటర్ల జాబితా సెకండ్ సమ్మరి రివిజన్‌లో భాగంగా శనివారం ఆమె కామారెడ్డికి వచ్చారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హతగల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి అనుసరిస్తున్న పద్ధతులు పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదు, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనకు చేపడుతున్న చర్యలను వివరించారు. ఓటరుగా నమోదు చేయించడంలో చురుకైన పాత్ర పోషించాలని రాజకీయ పార్టీలను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి


గంప గోవర్ధన్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్
- ప్రభుత్వ విప్ ఇంటి వద్ద ధర్నా

**కామారెడ్డి టౌన్:** తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. డిమాండ్‌లను పరిష్కరించాలంటూ శనివారం అంగన్‌వాడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో వారు అక్కడే బైఠాయించి కాసేపు ధర్నా చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అంగన్‌వాడీ ఉద్యోగులతో మాట్లాడి వినతిపత్రం తీసుకున్నారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, అంగన్‌వాడి ఉద్యోగులు కల్పన, సునంద, యాదమ్మ, లక్ష్మి, ఇంద్ర, జరీనా, సుకన్య, లలిత, భాగ్య పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

**భిక్కనూరు:** మండల కేంద్రానికి చెందిన పెంటకాడి అశోక్ (42) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావునాయక్ శుక్రవారం తెలిపారు. సిద్ధరామేశ్వరాలయం గేట్ సమీపంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు పరిశీలించినట్లు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

**రాజంపేటలో యువకుడు..**

**రాజంపేట:** రాజంపేట మండల పరిధిలోని తలమడ్ల రైల్వే స్టేషన్ సమీపంలో భిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన భూమని భరత్ (19) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**రెండు బైక్‌లు ఢీ: ఒకరు..**

**పిట్లం(జుక్కల్):** మండల కేంద్రంలోని రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి (66) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హన్మంత్‌రెడ్డి (66) పిట్లం సహకార సంఘంలో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


హన్మంత్‌రెడ్డి (ఫైల్)

## స్వగ్రామానికి చేరిన మృతదేహం

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** బతుకుదెరువు నిమిత్తం దుబాయ్‌కు వెళ్లిన ఓ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మృతి చెందడంతో మూడు నెలలకు స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలంలోని గొల్లపల్లికి చెందిన ఇందూరు మహేందర్ (49) బతుకు దెరువు నిమిత్తం గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడికెళ్లిన వారం రోజుల్లోనే మహేందర్ మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయాడు. దుబాయిలో ఉన్న తోటి గ్రామస్తులు ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఈ విషయమై మహేందర్ తండ్రి పెద్ద భూమయ్య దుబాయ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంతలో జూన్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందంటూ అక్కడి పోలీసులు స్థానిక మాద్యమాల్లో ప్రసరించారు. విషయాన్ని గమనించిన గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి ప్రతినిధులు గుండెల్లి నర్సింహులు, వెల్మల కిరణ్, గాడ్‌వంద్ నరేందర్ సహకారంతో మహేందర్ మృతదేహాన్ని ఇండియాకు తరలించారు. శనివారం రాత్రి మృతదేహం గొల్లపల్లికి చేరుకుంది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ రోదనలు మిన్నంటాయి. పేద కుటుంబానికి చెందిన మహేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులు కోరుతున్నారు.


మహేందర్ (ఫైల్)

## నిందితుడి రిమాండ్


**ఖలీల్‌వాడి:** నగరంలోని ఓ బంగారు దుకాణంలో షటర్‌తాళం పగులగొట్టి బంగారం చోరీ చేసిన ఓ నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని కిషన్‌గంజ్‌లోని గోల్డ్‌షాపులో మిర్చికంపౌండ్‌కు చెందిన పర్మటి ఎల్లప్పా తాళం పగులగొట్టి 60 గ్రాముల బంగారాన్ని చోరీ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు పాత నేరస్తుడని, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ చెప్పారు. గోల్డ్‌షాపు వర్కర్ మైదుల్ ముల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై విష్ణు ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**ఇందల్వాయి:** మండలం కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగారాం తండాకు చెందిన రతన్‌కు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తండాకు వస్తుండగా నిజామాబాద్ వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొందన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## గంజాయిపై ఉక్కుపాదం

- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి
- సీపీ సత్యనారాయణ


మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

**ఖలీల్‌వాడి:** రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు చేపట్టిందని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. దీని బారిన పడుతున్న యువత దూరంగా ఉంటేనే బాగుంటుందని లేకుంటే తమ జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో గంజాయి నియంత్రణపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి బారిన పడ్డ యువత చాలా మంది ఉన్నారని వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కొంతమంది డబ్బులు లేక మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని దీంతో తమ జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న, గంజాయి సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ గంజాయి నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 2023లో 23 కేసుల్లో 53 మందిని అరెస్టు చేయగా 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ధర్మారం(బి)లో బైక్ చోరీ

**డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బైక్‌చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణ తన బైక్‌ను రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచగా దుండగులు దొంగిలించినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ**

**నిజాంసాగర్(జుక్కల్):** మండలంలోని ఆరేడ్ గ్రామంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్ వైర్లను దొంగిలించినట్లు స్థానిక రైతులు శనివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.